సాక్షి
వికారాబాద్

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



ఆశలన్నీ నామినేటెడ్‌పైనే..

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఎనిమిది నెలలు అయినా తమ శ్రమను గుర్తించడం లేదని ఆ పార్టీ శ్రేణులు అంటున్నారు. 8లో▸



65 ఏళ్లు దాటితే ఇంటికే..

అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అనేక మార్పులు చేపట్టింది. 8లో▸



ప్రజారోగ్యంతో చెలగాటం

మాంసం విక్రయదారులు కనీస నిబంధనలు పాటించడం లేదు. వారి మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. 9లో▸

న్యూస్‌రీల్

బీజేపీ గీత సెల్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశంగౌడ్



బంట్వారం: బీజేపీ గీత సెల్ జిల్లా అధ్యక్షుడిగా బంట్వారానికి చెందిన వెంకటేశం గౌడ్ నియమితులయ్యారు. శనివారం వికారాబాద్ సమీపంలో రాష్ట్ర అధ్యక్షుడి పటేల్ వెంకటేశం గౌడ్ సమక్షంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వెంకటేశంగౌడ్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీని మరింతగా పటిష్టం చేయడం తోపాటు గౌడ కులస్తులకు అందుబాటులో ఉంటూ హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తనకు పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పటేల్ వెంకటేశంగౌడ్, కోకన్వీనర్ వీరయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు పాండుగౌడ్, మారుతీకిరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బాణాల ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీకి చెందిన బాణాల ప్రవీణ్‌కుమార్ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధీరజ్‌రెడ్డి, ఆర్‌కేపురం కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'డాక్టర్' అనితారెడ్డి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి శనివారం డాక్టర్‌గా రోగులను పరీక్షించారు. మండల పరిధిలోని చిన్నతూప్రా గ్రామంలో ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిబిరానికి వచ్చిన వారికి బీపీ, ఇతర పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిరుపేదలు నివసించే ప్రాంతాల్లో ఉచితంగా సేవలందించాలనే ఉద్దేశంతో ఆర్ట్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, మధరం నర్సింహగౌడ్,రాజు,అంజయ్య, పాష, రఘుగౌడ్, ఆవుల యాదయ్య,రాజునాయక్,రమేష్, లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు



ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం: విధి నిర్వహణలో, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలతోపాటు అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ తదితర విభాగాల నిర్వహణ, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

వస్తుంది అంటున్నారు..



నవాబుపేట: నేను నారెగూడ కెనరా బ్యాంకులో రూ.30 వేలు పంట రుణం తీసుకున్నా.. రెండు విడతల్లోనూ మాఫీ కాలేదు. బ్యాంకులో అడిగితే వ్యవసాయ అధికారులను అడగమన్నారు. వాళ్లని అడిగితే మళ్లీ బ్యాంక్ అకౌంట్, పాస్‌బుక్, ఆధార్ కార్డు కాపీలు ఇవ్వమన్నారు. ఇచ్చాను. వస్తుంది అంటున్నారు. కానీ నమ్మకం లేదు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలి.

– హన్మయ్య, రైతు, నారెగూడ

మాఫీ కాలేదు



కొడంగల్: నాది గుండ్లకుంట గ్రామం. మూడు ఎకరాల ఏడు గుంటల భూమి ఉంది. గతంలో రూ.75 వేలు క్రాప్ లోన్ తీసుకున్నా. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో మా పేరు లేదు. బ్యాంకు అధికారులకు, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశా. సాంకేతిక సమస్య వల్ల మాఫీ కాలేదని తెలిపారు. న్యాయం చేయాలి.

– అంజిలప్ప, గుండ్లకుంట

రూ.1.10 లక్షలు మాఫీ



యాలాల: వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న నాకు రుణమాఫీతో ఎంతో మేలు జరిగింది. నాకు రెండెకరాల పొలం ఉంది. కంది, పెసర పంట వేసుకున్నాను. రాస్నం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి గతంలో రూ.1.10లక్షల పంట రుణం తీసుకున్నా. రెండో విడతలో మాఫీ అయ్యింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి.

– పరశురాం, ముద్దాయిపేట



తాండూరు ఎస్‌బీఐ వద్ద రుణమాఫీ కోసం రైతుల క్యూ

మాఫీ ప్లీజ్..!

రుణమాఫీపై అన్నదాతల్లో మిశ్రమ స్పందన

- నగం మందికే పథకం అమలు
- మిగిలిన వారిలో ఆందోళన
- అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- న్యాయం చేయాలంటూ వేడుకోలు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

రుణమాఫీ కోసం రైతులు నెలల పాటు నిరీక్షించారు.. ఆ సమయం రానే వచ్చింది కానీ.. రెండు విడతల్లోనూ సగం మందికే లబ్ధి చేకూరడంతో.. పథకం అమలు కాని వారు తమ పరిస్థితి ఏమిటని అధికారులు, ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఇతర సాంకేతిక సమస్యలను సాకుగా చూపడం సరికాదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటనే మాఫీ చేయాలని కోరుతున్నారు. మూడో జాబితాలోనైనా తమ పేర్లు ఉండేలా చూడాలని అభ్యర్థిస్తున్నారు.

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న రుణమాఫీ పథకం కొంతమంది రైతుల్లో ఆనందం నింపగా మరి కొందరిలో ఆందోళన రేకెత్తిస్తోంది. రెండు విడతల్లో సగం మంది మాత్రమే రుణ విముక్తులయ్యారు. దీంతో పథకంపై మిశ్రమ స్పందన లభిస్తోంది. మాఫీ అయిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తుండగా అమలు కాని వారు వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకుల వద్ద పరుగులు పెడుతున్నారు. రేషన్‌కార్డు, సాంకేతిక సమస్యల కారణంగా పలువురి రైతులకు పథకం అమలు కాలేదు. రేషన్ కార్డు లేకున్నా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో కార్డు లేని వారికి మాఫీ కాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాఫీ కాని రైతుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌కు ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2వేల మందికి పైగా రైతులు ఫిర్యాదు చేశారు. రోజుకు సగటున 500 పైచిలుకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. అర్హులైన వేల మందికి రేషన్ కార్డులు లేకపోవడం, ఆధార్ కార్డుతో మ్యాచ్ కాకపోవడంతో, ఇతర సాంకేతిక సమస్యల వల్ల మాఫీ కాలేదు.

సగం మందికే విముక్తి..

రెండు విడతల్లో కలిపి సగం మంది రైతులకే రుణవిముక్తి లభించింది. జిల్లాలో 5.90లక్షల సాగు భూమి ఉండగా 2.50 లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా 1.7 లక్షల నుంచి 1.8 లక్షల మంది వివిధ బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకుంటున్నారు. దాదాపు రూ. 1,800 కోట్ల వరకు పంట రుణాలు పొందుతున్నారు. మొదటి విడత 46,633 వేల మంది రైతులకు రూ.256.26 కోట్ల మాఫీ అయ్యింది. రెండవ విడతలో రూ.1.5 లక్షల మందికి రూ. 262.64 కోట్ల మాఫీ చేశారు.

రెన్యూవల్ చేసుకోమన్నారు



బషీరాబాద్: నాకు, నా భర్త కృష్ణకు కలిసి 7.04 ఎకరాల భూమి ఉంది. నా పేరిట 3.04 ఎకరాలు ఉండగా, తాండూరులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 2023 డిసెంబరులో రూ.1.30 లక్షలు రుణం తీసుకున్నా. నా భర్త పేరిట 4 ఎకరాలు ఉంది. అదే బ్యాంకులో రూ.1.60 లక్షల రుణం తీసుకున్నాడు. ఇద్దరికి ఒకే రేషన్ కార్డు ఉంది. మా ఇద్దరిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ రాలేదు. బ్యాంకులో అడిగితే మీ రుణం మాఫీ కాలేదు రెన్యూవల్ చేసుకోమని చెబుతున్నారు. దయచేసి మా ఇద్దరిలో ఒక్కరికైనా మాఫీ చేయాలి.

– రుక్మిణి, మహిళా రైతు, మంతట్టి,

ఆదుకోవాలి



దోమ: నాకున్న 3.22 పొలానికి సంబంధించి దోమ ఎస్‌బీఐలో రూ.1.40 లక్షల రుణం తీసుకున్నా. ఇటీవల రుణం చెల్లించాలని బ్యాంకర్లు కోరితే మిత్తి కట్టి రెన్యూవల్ చేసుకున్నా. రుణమాఫీ గురించి వ్యవసాయశాఖ అధికారులను అడిగితే జాబితాలో పేరు ఉంది కానీ డబ్బు వెనక్కు వెళ్లాయని చెప్పారు. ప్రభుత్వం మూడో జాబితాలోనైనా పంట రుణాన్ని మాఫీ చేసి ఆదుకోవాలి.

– గద్య వెంకటయ్య, రైతు,దోమ

పేరు గల్లంతు



దౌల్తాబాద్: ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు దాసరి ఎల్లప్ప. గ్రామం చల్లాపూర్, దౌల్తాబాద్ మండలం. ఇతను రెండేళ్ల క్రితం సహకార బ్యాంకులో రూ.40 వేలు పంట రుణం తీసుకున్నాడు. మాఫీ జాబితాలో పేరు లేదు. ప్రస్తుతం అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులందరికీ పథకం అమలు చేయాలని కోరుతున్నాడు.

– దాసరి ఎల్లప్ప, రైతు, చల్లాపూర్

కోడళ్ల బంగారం తాకట్టు పెట్టా



తాండూరు: నాలుగేళ్ల క్రితం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.80 వేల పంట రుణం తీసుకున్నా. వడ్డీతో కలిపి రూ.1.20 లక్షలు అయ్యింది. మాఫీ అవుతుందని ఎంతో ఆశగా ఎదురు చూశా. రెండు విడతల్లోనూ నా పేరు రాలేదు. అధికారులను అడిగితే రేషన్ కార్డు ఆధారంగానే మాఫీ అవుతోందని చెబుతున్నారు. పంట పెట్టుబడి కోసం బ్యాంకు రుణం తోపాటు కోడళ్ల ఒంటిపై ఉన్న బంగారం సైతం తాకట్టు పెట్టా.. రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

– వెంకటమ్మ, మహిళా రైతు, ఐనెల్లి

రేషన్‌కార్డు లేదని..



కుల్కచర్ల: నేను తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.94,000 పంట రుణం తీసుకున్నా. రెండు విడతల్లోనూ మాఫీ కాలేదు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లా. రేషన్‌కార్డు లేకపోవడంతో మాఫీ వర్తించలేదని తెలిపారు.సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి.

– శివకుమార్‌గౌడ్, యువ రైతు, తిర్మలాపూర్

సరైన సమాధానం చెప్పడం లేదు



పరిగి: నేను రూ.60 వేలు, నా భార్య రూ.40 వేలు రుణం తీసుకున్నాం. ప్రతి ఏటా రెన్యూవల్ చేసుకుంటున్నాం. రెండు విడతల్లోనూ మాఫీ కాలేదు. రేషన్ కార్డు లేకపోవడం వల్లే పథకం అమలు కాలేదని అంటున్నారు. కొత్త రేషన్ కార్డు కోసం ఎన్నో సార్లు దరఖాస్తు చేశా. ఇప్పటి వరకు రాలేదు. మాఫీ గురించి అధికారులు, బ్యాంకర్లను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ప్రభుత్వం రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ అమలవుతుందని చెబుతున్నా మంజూరు కావడంలేదు. న్యాయం చేయాలి.

– మేకల శ్రీనివాస్, రైతు, ఐనాపూర్

సంతోషంగా ఉంది



మోమిన్‌పేట: నాకు రూ.40 వేలు మాఫీ అయింది. చాలా సంతోషంగా ఉంది. తిరిగి రుణం తీసుకోలేదు. మా నాన్నకు మోమిన్‌పేట సహకార సంఘంలో దీర్ఘకాలిక రుణం ఉంది. అది మాఫీ కాలేదు.

– పల్లె ఆనందం, రైతు, ఎన్కేపల్లి

బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా ..



తాండూరు రూరల్: ప్రభుత్వం రుణమాఫీ చేశామని చెబుతోంది. కానీ నాకు మాత్రం అమలు కాలేదు. 2021లో మల్కాపూర్ ఎస్‌బీఐలో రూ.1.30లక్షలు లోన్ తీసుకున్నా. నాలుగు నెలల క్రితం రూ.12 వేలు వడ్డీ కట్టి రెన్యూవల్ చేయించా. రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. రేషన్‌కార్డు కూడా ఉంది. అయినా పథకం వర్తించలేదు. పాసు పుస్తకం, ఆధార్‌కార్డుతో అధికారులు, బ్యాంకు చుట్టూ తిరుగున్నా ఫలితం లేదు.

– సిద్ధయ్య స్వామి రైతు, సంగెంకలాన్



కొత్తూరులో రుణమాఫీ కాని రైతులతో దళిత, ప్రజాసంఘాల నాయకులు

నిబంధనలు లేకుండా మాఫీ చేయాలి

ప్రజాసంఘాల డిమాండ్

బొంరాస్‌పేట: ఎలాంటి నిబంధనలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొత్తూరులో ఆ సంఘాల నాయకులు రుణమాఫీ కాని రైతులతో సమావేశమయ్యారు. 2015 నుంచి 2017వరకు పంట రుణాలు తీసుకున్న రైతులుండగా 2018 డిసెంబరు 12నుంచి ప్రభుత్వం మాఫీ ప్రకటించడం సరికాదన్నారు. దీంతో చాలామంది రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, అధికారుల వద్దకు వెళితే సరైన సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం సభ్యుల తోపాటు నాయకులు చంద్రయ్య, బాలు పాల్గొన్నారు.

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి తన తండ్రి డోకూరి రాంరెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ముఖ ద్వారాన్ని (ఆర్చ్) ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, పీసీబీ కార్పొరేషన్ చైర్మన్ బాలాజీసింగ్, ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అర్బన్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. కళాకారుల అభివృద్ధికి, వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. ఎమ్మెల్యే కోరిక మేరకు వెల్జాల్‌లోని వేదాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం, చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్ప గుట్ట మల్లి ఖార్జునుడి ఆలయన్ని, దేవుని పడకల్‌లోని శ్రీ వేంకటేశ్వరుడి దేవాలయాన్ని, కడ్తల్ మండలంలోని మైసిగండి దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం దేవుని పడకల్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ ద్వార నిర్మాణ దాత డోకూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు భగ్వాన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బురిడీ కొట్టించబోయి.. బుక్కయ్యారు!

- శాంతిపూజ చేస్తామంటూ బంగారం కాజేసే యత్నం
- బాధితుడి అరుపులతో అప్రమత్తమైన స్థానికులు
- పరిగి మండలం నస్కల్‌లో దొంగబాబాలకు దేహశుద్ధి
- పోలీసుల అదుపులో ముగ్గురు రాజస్థాన్ వాసులు



బొలేరో వాహనంలో దొంగబాబాలు

పరిగి: బాబాల అవతారంలో జనాలను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించిన దొంగబాబాలకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన పరిగి మండలం నస్కల్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కాషాయ వస్త్రాలు ధరించి, విభూది పెట్టుకొని గ్రామంలోకి ప్రవేశించారు. పరిగి – వికారాబాద్ మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో భోజనం తిన్నారు. నిర్వాహకుడు శ్రీధర్ డబ్బులు అడగగా 'మేము స్వామీజీలం మమ్మల్ని డబ్బులు అడగొద్దు.. మీకు అంతా మంచి జరుగుతుంది' అన్నారు. అంతటితో ఆగకుండా మాటలో మాట కలిపి 'నీ జాతకం ఏమీ బాగోలేదు.. చాలా సమస్యలు ఎదుర్కొంటున్నావు.. శాంతిపూజ చేస్తే మేలు జరుగుతుంది' అని నమ్మబలికారు. శ్రీధర్ వీరి మాటలు నమ్ముతున్నట్లు గుర్తించి.. ఇంట్లోకి వెళ్లి ఒక రాగి చెంబు తీసుకురమ్మని సూచించారు. అనంతరం చెంబునిండా నీళ్లు తెమ్మన్నారు. ఆతర్వాత ఏవో మంత్రాలు చదువుతున్నట్లు చేసి, విభూది, కుంకుమ వంటివి వేశారు. అనంతరం శ్రీధర్ చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని అందులో వేయమన్నారు. ఉంగరం వేయగానే.. ఇంట్లోకి వెళ్లి తెల్లని వస్త్రం తీసుకురమ్మన్నారు. అతను వస్త్రం తీసుకుని వచ్చేలోపే.. వారి వద్ద ఉన్న తెల్లటి వస్త్రంలో ఓ గులకరాయిని పెట్టి చెంబుకు కట్టారు. దాన్ని శ్రీధర్ చేతిలో పెట్టి రేపటి వరకూ వస్త్రం విప్ప కూడదని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోతుండగా.. అనుమానం వచ్చిన శ్రీధర్ వస్త్రాన్ని విప్పి చూడగా రాయి కనిపించింది. కంగుతిన్న బాధితుడు ఇదేమిటని ప్రశిస్తుండగా పారిపోయే ప్రయత్నం చేశారు. అడ్డుకోవడానికి ముందుకు వెళ్లడంతో వారి చేతిలో ఉన్న కత్తిలాంటి వస్తువులను పైకి విసిరారు. ఊహించని ఈ పరిణామంతో శ్రీధర్ గట్టిగా అరిచాడు. అప్పటికే దొంగబాబాలు తాము వచ్చిన బొలేరో వద్దకు చేరుకున్నారు. బాధితుడి అరుపులు విన్న స్థానికులు వెంటనే బాబాలను అడ్డుకుని, దేహశుద్ధి చేశారు. పోలీసులు వచ్చి విచారణ చేయగా రాజస్థాన్ రాష్ట్రం, సాలి జిల్లా, చెట్టిదూదాని గ్రామానికి చెందిన రావత్‌నాథ్, మిట్టస్‌నాథ్, మేఘనాథ్‌లుగా గుర్తించారు. వీరు ప్రయాణిస్తున్న బొలేరోకు గుజరాత్ పాసింగ్ నంబర్ ప్లేట్ ఉంది. బాధితుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

వృక్ష సంపదతోనే మనుగడ

- నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, సకాలంలో వర్షాలు కురిసేందుకు చెట్లు దోహద పడతాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 14, 23 వార్డుల్లోని పార్కుల్లో చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే వాకింగ్ ట్రాక్‌లు, యోగా బెడ్స్, పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు సమకూర్చాలని కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు సూచించారు. 23వ వార్డులో ఆడుకుంటున్న చిన్నారులను కలెక్టర్ పలకరించారు. ఎలాంటి ఆట వస్తువులు కావాలో అడిగి తెలుసుకున్నారు. వార్డుల వారీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బంది సూచించారు. మున్సిపల్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, రామస్వామి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పార్కులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చైర్ పర్సన్ మంజుల

క్లుప్తంగా

నియామకం

ధారూరు: బీజేపీ గీతసెల్(గౌడ్ విభాగం) జిల్లా కో కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. సమష్టిగా గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ తెలంగాణ గీతసెల్ రాష్ట్ర కన్వీనర్ పి.వెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకుడు పాండుగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ

అత్తాపూర్: ఓ బాలుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రషీద్‌మియా తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎం పహాడి షరీఫ్ గార్డెన్ ప్రాంతంలో నివాసముంటున్న షేక్ మహబూబ్ కుమారుడు షేక్ మహబూబ్ మన్సూర్(6) స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల విద్యతో పాటు అరబిక్ నేర్చుకునేందుకు సమీపంలో ఉన్న ట్యూషన్ మాస్టర్ వద్ద అరబిక్ భాష నేర్చుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ట్యూషన్ నుంచి ఇంటికి వస్తున్న మహబూబ్ మన్సూర్‌ను గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాబును చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ కార్యవర్గ సమావేశం శనివారం డివిజన్ అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు శ్రీరాం నగర్ సర్పంచ్, సీనియర్ నాయకులు ఎస్. ప్రభాకర్ రెడ్డి, చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డిలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. ఇందులో భాగంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం స్వతంత్ర సమరయోధుల విగ్రహాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు యువ మోర్చ ఆధ్వర్యంలో తిరంగా స్కూటీ ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, రాజశేఖర్, జయానంద్‌రెడ్డి, కిరణ్, వెంకటేష్, గాయత్రి శశికాంత్ శర్మ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలనపై పోరాడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

శంషాబాద్: రంగారెడ్డి జిల్లా నిర్మాణ మండలి సమావేశానికి శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కారు పేదలను దోచి పెద్దలకు పెడుతుందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలకు మోకరిల్లుతున్న కేంద్ర సర్కారు కార్మికుల హక్కులను మాత్రం కాలరాస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఉద్యోగం పేరిట మోసం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో నివాసమంటున్న కాశీనాథ్ అనే వ్యక్తి ఎయిర్‌పోర్టులో ఓ కాంట్రాక్టు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తన పరిచయాల ద్వారా ఉద్యోగాల్లో పెట్టిస్తానని నలుగురు యువకుల నుంచి యాభై వేలు, డెబ్బైవేల చొప్పున తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకపోగా మాట దాటవేస్తుండడంపై అతడిని బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ సబ్‌రోడ్‌లో ఉన్న ఆల్ సాద్ బైట్ అల్ మండీలో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేశారు. లోపలంతా అపరిశుభ్రంగా ఉందన్నారు. వండిన ఆహార పదార్థాలపై మూతలు లేవని, వాటిపై బొద్దింకలు తిరుగుతున్నట్లు గుర్తించారు. మండీకి సంబంధించిన లేబుల్ కూడా లేవని, వంటగదిలో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడకం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆశలన్నీ నామినేటెడ్‌పైనే..



కుల్కచర్ల మార్కెట్ కమిటీ కార్యాలయం

- ఎదురు చూస్తున్న కాంగ్రెస్ శ్రేణులు
- మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు కోసం ఆరాటం
- స్థానిక సంస్థల అనంతరమే ప్రక్రియకు పచ్చజెండా!

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఎనిమిది నెలలు అయినా.. ప్రభుత్వం తమ శ్రమను గుర్తించడం లేదని అధికార పార్టీ శ్రేణులు అలకబూనారు. దశాబ్ద కాలంగా ఎలాంటి పదవులు లేకున్నా.. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు.. నామినేటెడ్ పదవుల్లో రూపంలో గుర్తింపు లభిస్తుందని భావించారు. కానీ.. ఆ అంశం ఆలస్యం అవుతుండడంతో ఆశావహులు నిరుత్సాహ పడుతున్నారు. ముఖ్యంగా కుల్కచర్ల మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకం కోసం ఎదురు చూస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గాన్ని నియమించాల్సి ఉన్నా.. అధిష్ఠానం ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోవడంతో కార్యకర్తలు నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలక వర్గం పదవీకాలం ముగిసి ఏడాది కాలం కాగా.. ప్రస్తుత ప్రభుత్వంలో 8 నెలలు గడిచింది.

స్థానిక ఎన్నికల తరువాతే

కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన అనంతరం ఎన్నికల హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. దరఖాస్తులు స్వీకరించడం, అర్హులను గుర్తించడం, పథకాల అమలుతో ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఆ తరువాత పార్లమెంటు ఎన్నికలు వచ్చాయి. సర్పంచులు, ఎంపీటీల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ కారణంగా నామినేటెడ్ కొలువుల ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. వెంటనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు చేపట్టినట్లయితే.. మరో మూడు నెలలు పట్టవచ్చు.

పెరుగుతున్న ఆశావహులు

మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు ఆలస్యమవుతున్న కొద్దీ.. ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. చైర్మన్ పదవికి పోటీ పెరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, యువజన కాంగ్రెస్ నేతలు కుమ్మరి స్వామిలు ముందు వరుసలో ఉన్నారు. ఎస్టీలకు అవకాశం కల్పించినట్లయితే.. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, రాంలాల్ నాయక్, రవి, విఠల్ నాయక్‌లు చైర్మన్ గిరి బరిలో ఉన్నారు. వీరే కాకుండా చౌడాపూర్ మండలానికి ఈ దఫా అవకాశం ఇవ్వాలని నేతలు కోరుతున్నారు. ఇక్కడ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, కొత్త ఉమాపతిరెడ్డిలను పరిశీలించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ద్వితీయశ్రేణి నాయకులు సైతం అవకాశం కల్పించాలంటూ పార్టీ పెద్దలకు విన్నవిస్తున్నారు. ఏది ఏమైనా త్వరితగతిన మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసి, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.



హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

ఉద్దేశ పూర్వకంగానే దాడులు

- చోద్యం చూస్తున్న బంగ్లాదేశ్ ప్రభుత్వం
- హిందువులకు రక్షణ కల్పించని వైనం
- హిందూ ఐక్య వేదిక నేతల ఆగ్రహం
- తాండూరు బంద్ ప్రశాంతం



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

తాండూరు టౌన్: బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై అక్కడి మెజార్టీ వర్గ ప్రజలు ఉద్దేశ పూర్వకంగానే దాడులకు పాల్పడుతున్నారని హిందూ ఐక్య వేదిక నేతలు ఆరోపించారు. ఇంత జరుగుతున్నా బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బంగ్లా అంతర్గత కలహాల నేపథ్యంలో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం తాండూరు బంద్‌కు పిలుపునివ్వగా.. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. బంగ్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అక్కడి ప్రభుత్వానికి ఎదురు తిరిగిన ప్రజల్లో, కొందరు కావాలనే మనవారిపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయటం సిగ్గు చేటన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్కడి హిందువుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని ఎడలా దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఇక మీదట అక్కడి వారికి ఏమాత్రం హాని కలిగినా.. బంగ్లా సర్కార్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. అనంతరం డీఎస్పీ బాలకృష్ణా రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

‘సీజనల్’.. డేంజర్



షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

అప్రమత్తతతోనే ఆరోగ్య రక్షణ

- పరిశుభ్రతే ప్రధాన ఆయుధం
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వానలతో పరిసరాల్లో నీటి నిల్వ పెరిగి దోమలు వ్యాప్తిచెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని వైద్యవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వైద్యాధికారులు సూచిస్తున్నారు.

రోగాల వ్యాప్తికి అనుకూలం

వర్షాల కారణంగా ఇళ్లలో నీటి వినియోగం తక్కువే. పరిసరాల్లో డబ్బాలో నిలిచిన నీటితో దోమలు వ్యాప్తి చెంది, లార్వా వృద్ధి చెందుతుంది. ఈ దోమలు ఇళ్లలోని అల్మారాలు, ఫర్నీచర్ వెనక ఉంటాయి. శిథిల భవనాలు, ఖాళీగా ఉన్న ఆవాసాల్లో శుభ్రత లోపించి దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం ఎక్కువ. వాతావరణం అనుకూలించగానే మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతాయి. పైపులైన్ లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

పరిశుభ్రత పాటిస్తే మేలు



వర్షాలతో వ్యాధులు వ్యాప్తి చెందే ఆస్కారం ఉంటుంది. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు. అనారోగ్యం బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉప వైద్యాధికారి

జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. కూలర్లు, డ్రమ్ములోని నీటిని పారబోయాలి. పాత్రలపై మూతలు పెట్టి ఉంచాలి.
- ఇంట్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- చల్లదనం పెరిగిన నేపథ్యంలో ఊపిరితిత్తుల సమస్యలున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెచ్చదనం ఉండేలా చూడాలి.
- కాచి చల్లార్చిన నీటితోపాటు, వేడి పదార్థాలనే ఆహారంగా తీసుకోవాలి.
- మాంసాహారం తగ్గించడంతో పాటు అవుట్‌సైడ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

వ్యక్తి అదృశ్యం



మనాజీర్(ఫైల్)

పరిగి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఖుదావన్‌పూర్ గ్రామానికి చెందిన ఎండీ మనాజీర్, షేక్ సనాబేగం దంపతులు రెండు సంవత్సరాలుగా పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 8న ఉదయం సనాబేగం టైలరింగ్ పని నిమిత్తం పట్టణ కేంద్రంలోని బాహార్‌పేట్‌కు వెళ్లగా.. అమె భర్త ఇంట్లోనే ఉన్నాడు. సాయంత్రం వచ్చి చూడగా మనాజీర్ ఇంట్లో కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వికసించిన బ్రహ్మ కమలం



బ్రహ్మ కమలం

బొంరాస్‌పేట: మండల పరిధి తుంకిమెట్ల గ్రామంలో కరణం నాగూరావు ఇంట్లో శనివారం బ్రహ్మ కమలం వికసించింది. దీంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తంచేస్తూ.. పుష్పం వద్ద పూజలు చేశారు.

ఆవుకు చికిత్స

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోవును గోరక్షక్ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసుల సహాయంతో గోశాలకు తరలించారు. కాళి మందిర్ ప్రధాన రహదారిపై ఓ వాహనం రోడ్డుపై ఉన్న గోవును ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గోవు కాలు విరిగి కుప్పకూలింది. ఇది గమనించిన గోరక్షక్ సభ్యులు మల్లేశ్ యాదవ్ గోవు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గోవును అత్తాపూర్‌లోని గోశాలకు తరలించారు. అక్కడి వెటర్నరీ వైద్యులు మూగజీవికి శస్త్ర చికిత్స చేశారు.

వర్గీకరణతో మాదిగలకు న్యాయం

- 57 కులాలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున



సమావేశంలో మాట్లాడుతున్న సమితి నాయకులు

కొడంగల్: ఎస్సీ వర్గీకరణ వలన మాదిగలకు న్యాయం జరగనుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ, ఉపాధ్యక్షుడు మల్కప్ప అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ.. ఈ నెల 13న హైదరాబాద్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నామని, దానిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమితి కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మల్లికార్జున మాట్లాడారు. వర్గీకరణతో మాదిగల కులస్తులతో పాటు 57 ఉప కులాలకు విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత దక్కనుందని తెలిపారు. ఆర్థికంగా, సామాజికం, రాజకీయంగా మేలు జరగనుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అంజి, జాని, వెంకట్, అజయ్, ప్రకాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై కేసు

మొయినాబాద్: వైద్యం వికటించి మహిళ మృతి చెందిన ఘటనలో డాక్టర్‌పై కేసు నమోదైంది. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామానికి చెందిన మద్దెపాగ సావిత్రి(30) కాలు విరిగి స్థానిక భాస్కర ఆసుపత్రిలో చేరారు. ఆమెకు శస్త్రచికిత్స చేస్తుండగా వైద్యం వికటించి మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన పోలీసులు.. ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై కేసు నమోదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శనివారం ఉదయం వరకు ఆసుపత్రిలోనే బైఠాయించారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణలో ఉందని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

డాక్టర్ నిర్లక్ష్యం లేదు

కాలు విరిగిన మహిళ సావిత్రికి శస్త్ర చికిత్స నిర్వహించిన అనంతరం ఆమె మృతి చెందింది. ఇందులో డాక్టర్ నిర్లక్ష్యం లేదు. శస్త్ర చికిత్సకు ముందుగా టెస్ట్ చేసిన తర్వాత ఆమెకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు పేషెంట్ బాగానే ఉంది. ఆ తరువాత ఆమెకు స్ట్రోక్ ఏమైనా వచ్చి ఉండవచ్చు. పోస్టుమార్టం రిపోర్టులో అన్ని విషయాలు తెలుస్తాయి.

– రాంచందర్‌రావు, భాస్కర ఆస్పత్రి సూపరింటెండెంట్

ద్విచక్ర వాహనం ఢీకొని..

గాయపడిన పారిశుద్ధ్య కార్మికురాలు



చికిత్స పొందుతున్న సరస్వతి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికురాలికి బైకు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గగన్ పహాడ్ ప్రాంతానికి చెందిన సరస్వతి శనివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో మైలార్‌దేవ్‌పల్లిలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సరస్వతిని ఓ బైకు దుర్గానగర్ నుంచి పల్లెచెరువుకు వెళ్లే మార్గంలో వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె గాయపడింది. తోటి కార్మికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఆనంద్, ఏరాజులు బాధితురాలిని పరామర్శించారు. పారిశుద్ధ కార్మికుల పట్ల సర్కిల్ అధికారులు శ్రద్ధ వహించాలని కోరారు.

గృహిణి అదృశ్యం



అనిత అహిర్వాల్(ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శనివారం తెలిపిన ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భగవాన్‌దాస్ అహిర్వాల్, అనిత అహిర్వాల్(29) దంపతులు. వీరు రెండు నెలల క్రితం తుక్కుగూడ హార్డ్‌వేర్ పార్కులో కూలి పని కోసం వలస వచ్చారు. ఈ నెల 6న భగవాన్‌దాస్ తుక్కుగూడ మార్కెట్‌కు వెళ్లొచ్చేవరకు భార్య ఇంట్లో కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో కానీ.. 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్య



యాదయ్య(ఫైల్)

మణికొండ: అనారోగ్య సమస్యలు, భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మణికొండ మున్సిపాలిటీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న యాదయ్య(48) ఆత్మహత్య చేసుకున్నాడు. శివాజీనగర్ కాలనీలో నివాసముంటున్న యాదయ్యకు జాండీస్ వచ్చాయి. దీంతో మద్యం తాగొద్దని భార్య పలు మార్లు చెప్పింది. ఈ విషయంలో దంపతులకు శనివారం ఉదయం గొడవ జరిగింది. అనంతరం భార్య అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లగా, ఇద్దరు పిల్లలు కళాశాలలకు వెళ్లారు. గొడవతో మనస్తాపం చెందిన యాదయ్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన అతని తమ్ముడు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

అదనపు డివైడర్ తొలగింపు

స్పందించిన నాయకులకు అభినందనలు తెలిపిన స్థానికులు



అదనంగా నిర్మించిన డివైడర్(ఫైల్)

చేవెళ్ల: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై అదనంగా నిర్మించిన డివైడర్‌ను ప్రజల ఫిర్యాదుతో స్థానిక నాయకులు స్పందించి శనివారం ఉదయం తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య కొంతమేరకు తీరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బస్‌స్టేషన్ ఎదుట, విలేజ్ చౌరస్తాలో నిబంధనల మేరకు కావాల్సిన స్థలం వదిలి రాతితో డివైడర్‌ను కట్టారు. కానీ గతంలో కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులు.. డివైడర్ మధ్యలో స్థలం ఎక్కువగా ఉందని, దీంతో ట్రాఫిక్ సమస్య వస్తుందని భావించి, డివైడర్‌ను పొడిగించి సిమెంట్‌తో కట్టించారు. ఇప్పుడు ఇది బస్సులు బయటకు వచ్చే సమయంలో వాహనాలు విలేజ్ రోడ్డుకు మళ్లేందుకు స్థలం తక్కువగా ఉండటంతో రోజు ట్రాఫిక్ సమస్య ఉత్పన్న మవుతోంది. దీంతో దీనికి తొలగిస్తే బాగుటుందని స్థానిక ప్రజలు, కొందరు నాయకులు మాజీ సర్పంచ్ శైలజఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి డివైడర్‌ను తొలగించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో శనివారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. క్రీడాకారులు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆటగాళ్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

65 ఏళ్లు దాటితే ఇంటికే

- అంగన్‌వాడీ సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సు ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కొడంగల్ ప్రాజెక్ట్‌లో 31 మంది ఆయాల గుర్తింపు



చిలుముల మైల్వార్ అంగన్‌వాడీ కేంద్రం

దుద్యాల్: అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇటీవల పాఠశాలల పరిధి కేంద్రాల్లో ప్రీ స్కూల్ ప్రారంభానికి కార్యాచరణను సిద్ధం చేసింది. అందులో భాగంగా మార్పులు చేర్పులు అనివార్యం చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఆయాల్లో 65 ఏళ్ల వయస్సు పై బడిన వారు ఉద్యోగ విరమణ చేయాలంటూ గతంలో ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. దీంతో కొడంగల్ క్లస్టర్ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాల నుంచి విరమణ వయస్సు నిండిన టీచర్లు ఎవరూ లేక పోగా.. 31 మంది ఆయాలను గుర్తించినట్లు ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు.

కేంద్రాల నిర్వహణ ప్రశార్థకమే

కొడంగల్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆయాల్లో 31మంది రిటైర్మెంట్‌కు సిద్ధంగా ఉండటంతో ఆ కేంద్రాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారనుంది. టీచర్లు లేని సమయంలో వారే సెంటర్లను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కొడంగల్ పరిధి 13 సెంటర్లలో టీచర్లు లేక.. ఆయాలతోనే నడుస్తున్నాయి. ఇలాంటి కేంద్రాల్లో పనిచేస్తున్న వారు కూడా ఉద్యోగ విరమణ పొందితే వాటి కొనసాగింపు కష్టతరం కానుంది.

ఉద్యోగ విరమణ బెనిఫిట్

ఉద్యోగ విరమణ పొందనున్న టీచర్లకు రూ.1లక్ష, ఆయాలకు రూ.50 వేల చొప్పున బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారమే సంబంధిత అధికారులు ముందుకు వెళ్తున్న క్రమంలో ప్రయోజనం పెంచాలంటూ అంగన్‌వాడీలు ధర్నాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.1లక్ష వరకు పెంచుతున్నట్లు శిశు సంక్షేమ శాఖ మంత్రి మంత్రి సీతక్క గతంలో ప్రకటించారు. కానీ అధికారికంగా జీఓ రాలేదని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు



65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ సిబ్బందిని గుర్తించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాల మేరకు కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల క్లస్టర్లలో 31 మంది ఆయాలకు 65 ఏళ్లు పూర్తయినట్లుగా గుర్తించాము. వారి ఆ వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం.

– కృష్ణవేణి, సీడీపీఓ, కొడంగల్ ప్రాజెక్ట్

ఆధార్ ఆధారంగా నిర్ధారణ

కొడంగల్ క్లస్టర్ నాలుగు మండలాల్లో 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ విరమణ వయస్సు ప్రకటన వెలువడటంతో ఐసీడీఎస్ అధికారులు నిర్ధారణ పనిలో నిమఘ్నమయ్యారు. కొడంగల్‌లో 10 మంది, బొంరాస్‌పేట 10 మంది, దౌల్తాబాద్‌లో 11 మంది ఆయాలు 65 ఏళ్లు పై బడిన వారు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం పై అధికారులకు నివేదిక పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఆధార్ కార్డులోని పుట్టిన తేది ఆధారంగా ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.